# నిజా నిజాలు



పి. రాజ్యలక్ష్మి

అసలే ఊరు కొత్త. దానికి తోడు విసిరేసినట్లుగా ఇక్కడో ఇల్లూ అక్కడో ఇల్లూ, మధ్య మధ్య పెద్ద పెద్ద ఖాళీ స్థలాలూను. ఆ స్థలాల్లో రాత్రిళ్లు చూస్తే మఠం వేసుకుని కూచున్న మహా రాక్షసులలాగ కనిపించే రక్కసపొదలూ, శివం ఎక్కి తలలు ఆడిస్తున్న భూతాల్లా అనిపించే తుమ్మచెట్లూ. ఇలా ఎదిగీ ఎదగని ఆ పేటకి నోపక్క రైల్వేలైనూ, మరో పక్క నల్లని తారు రోడ్డూ, సాధారణంగా సందడి ఏం చెయ్యకుండా పెద్ద తాచులలా పరుచుకొని ఉండి, కాపలా కాస్తున్నాయా అన్నట్లు— తక్కిన రెండు పక్కలా పేటని బాగా ఆనుకొని చాలా దూరందాకా పరుచుకొని, ఖాళీగా కనిపిస్తున్న పెద్ద మైదానం నిద్దరోతూంటే, దాని వీపు మీద కూచుని రాత్రి రాజ్యాన్ని పాలిస్తున్న బ్రహ్మ రాక్షసుడా అనిపించేటంతటి పెద్ద జువ్వి చెట్టూ— విరబోసికొన్నదాని జడల సందుల్లోంచి పడిన మసక వెలుతుర్లో నవ్వుతూ కూచున్న భయంకర సత్వంలా పెద్ద దిగుడు బావీ, చూసేసరికి ఒళ్లు జలదరించి ఒణుకు పుట్టింది.

వాళ్ళ భయంతో మొదటి రోజు రాత్రి నిద్దర పట్టలేదు. చూసి చూసి ఇలాంటి చోట రూమ్ తీసుకున్నానేమిటా అనుకున్నా. నాకు ముందిక్కడ పని చేసినావిడ ఈ రూమ్‌లోనే ఉందిట. మరి ఎలా ఉందో! అయినా నాకు నచ్చిన రూమ్ నేను చూసుకోవాలి కాని నౌఖరుని చూడమనడ మేమిటి? ఇదిగో ఇలాంటిది చూశాడు— ప్చ్— ఈ రోజుల్లో నౌఖరుగాళ్ళు బొత్తిగా బాధ్యతేం మొయ్యడం లేదు. వాళ్ళు పెద్ద పెద్ద రెవిన్యూ ఆఫీసర్లనే లెక్క చెయ్యడం లేదు. అటువంటప్పుడు హో "వుమన్ వెల్‌ఫేర్ ఆఫీస"రంటే లెఖ్ఖా? ఏమేనా అంటే "ఏం చెయ్యమంటారు? ఇంతకంటే మంచి రూమ్‌లు లేవు. నచ్చకపోతే మీరే ఇంకోటి చూసుకోండి. నన్ను చూడమంటే నావల్ల కాదు. అయినా రూమ్ చూడడం నా డ్యూటీ కాదు" అని చటుక్కున మొహం మీద వేశే లాగ ఉన్నాడు— సరే— సంక్రాంతి వెళ్ళేదాక ఇందులో ఎలాగో అలాగ కాలక్షేపం చేద్దాం. ఈ లోగా ఇంకో మంచి రూమ్ కోసం వెతికి అందులోకి మారవచ్చు— సంక్రాంతి అంటే ఎంత? ఇవాళ నెల పట్టారు కదా! ఇంక ఒక్క నెల...అంటే సరిగ్గా ముప్ఫై రోజులు.

ఇలా ఆలోచించుకుంటూ, బయట గట్టిగా గాలివేసి చెట్ల ఆకులు చప్పుడైనప్పుడల్లా, గబ్బిలమో, గుడ్లగూబో అరిచి నప్పుడల్లా, ఉలిక్కిపడుతూ, అపరిమితమైన భయంతో అవ్యక్తమైన అస్థిమితంతో నిద్ర లేకుండా ఆ రాత్రి తెల్లవార్లూ మంచం మీద అటూ ఇటూ దొర్లుతూనే ఉన్నాను.

దూరం నుంచి కోడి కూత వినిపించి లేచి లైటు వేశాను, వాచీ చూసుకుంటే నాలుగయింది. ఇంకా గంట, గంటన్నరికి కాని తెల్లారదు. పడుకుందాం అంటే నిద్ర పట్టడం లేదు. ఏమీ తోచక గదిలో అటూ ఇటూ పచార్లు చేయసాగాను. ఇంతలో తెల్లారగట్ల వెళ్ళే ఎక్స్‌ప్రెస్ కాబోలు ఉలిక్కి పడేలాగ పెద్ద కూత కూసింది. మహా వేగంతో పోయే ఆ రైలుని

చూడాలని పించింది. భయం వల్ల పడుకో బోయేటప్పుడు వేసిన కిటికీ తలుపులు తెరిచాను. గట్టిగా కూస్తూ చీకటిని చీల్చుకుంటూ విపరీతమైన వేగంతో పోతోంది రైలు. మధ్యమధ్య ఇళ్ళూ చెట్లూ అడ్డువచ్చి ఇట్టే అదృశ్యం అయి మళ్ళీ ఇట్టే కనిపిస్తూ వేగంగా కదిలి పోతున్నాయి రైలు పెట్టెలు. ఆ పెట్టె ల్లోంచి కనిపిస్తున్న దీపాలు, కాంతి తోరణంలా కదిలి పోతూంటే, రెప్ప వాల్చ కుండా వాటికేసే చూస్తూ ఉండిపోయాను. కాస్సేపటికి దూర దూరాలకి పోయిన దీపాలు ఇంక కనిపించడం మానేశాయి. ముఖం ఇటు తిప్పానో లేదో కళ్ళు తిరుగు తున్నట్లనిపించింది, కదులుతూన్న రైలుని చూడడం వల్ల కాబోలు— గట్టిగా కళ్ళోసారి మూసుకొని ఒక్క క్షణం ఆగి మరీ తెరిచాను.

తెరిస్తే ఎదురుగా కాళీ స్థలం అవతల ఉన్న ఇంటి ముందు ఎవరో ఒంగుని ఉన్నట్లు ఆ మసక చీకట్లో అనిపించింది. కళ్ళోమారు నులుపుకొని మళ్ళీచూశాను. గాలికి వూగుతూన్న తుమ్మ చెట్టుకొమ్మలు మధ్య మధ్య అడ్డు వస్తూన్నా సరిగానే కనిపిస్తోంది. పదహారు, పదిహేడేళ్ల అమ్మాయి. పరికిణీ కుండువా వేసుకొని, వాలు జడ బుజం మీంచి వాలి ముందుకు పడుతూంటే ఒంగుని చక్కగా ముగ్గులు పెడుతోంది. ఆ చుట్టు పక్కల ఇంకా ఎవరూ నిద్దర లేవలేదు. ఇంచక్కా ఆ అమ్మాయికి ఎంత శ్రద్ధో! తెల్లవారకుండా లేచి సంక్రాంతి ముగ్గు పెడుతూంది. ఆ అమ్మాయినీ, ఆ అమ్మాయి పెడుతున్న ముగ్గునీ ఎంత సేపు చూసినా చూడాలని పించింది. సన్నని మెత్తని ఆ చేతుల్లోంచి జారి ముచ్చటైన రూపాలుగా ఆ ముగ్గు మారుతుంటే వింతగాచూస్తూ ఎంతసేపో అలా వుండిపోయాను.

ఇంతలో ఆ ఇంటి ప్రక్క ఇంటివారె వరో బయటికి వచ్చిన అలికిడి అయింది. చటుక్కున ముగ్గు పెడుతూన్న ఈ అమ్మాయి తుమ్మ చెట్టు నీడలోకి తప్పుకొంది. సిగ్గు కాబోలు— అవును ఆ వయస్సులో అలాగే ఉంటుంది. ఎవరిని చూడడాని కయినా సిగ్గే! నాలో నేను నవ్వుకొని కిటికీ తలుపులు నెమ్మదిగా దగ్గరికి వేసి, టేబిల్ దగ్గరికి వచ్చాను ఆ రోజు ఆఫీసు కాగితాలు చూడడం కోసం. బాగా తెల్లారేక యధా లాపంగా చూస్తే కిటికీ సందు లోంచి ఆ ఇంటివారి పనిమనిషి కాబోలు కని పించింది. ఒత్తుగా కళ్ళాపు జల్లుతూ. అరే! తెల్లారగట్ల ఆ అమ్మాయి పెట్టిన ముగ్గు అంతా ఈ తెలివితక్కువ దాసీది పాడు చేస్తోందే! కిటికీ తెరిచి చూద్దును గదా ఆ అందమైన ముగ్గు ఆనవాలే లేదు ఆ ముంగిటిలో!

ఆ తర్వాత నాలుగైదు రోజులదాకా, కొత్తగా ఛార్జి తీసుకున్న ఆఫీసు తాలూకు కాగితాలు చూసుకోవడం అటు ఆఫీసులో తెమలక, ఇంటికి కూడా తీసుకు వచ్చి అర్ధరాత్రిదాకా వాటితో కుస్తీపడుతూ ఉండడం వల్ల, ఆ ధ్యాసలో పడి ఆ వాతావరణాన్నీ, తెల్లవారగట్ల చూసిన ఆ అమ్మాయి సంగతినీ మరిచి పోయాను.

ఓ రోజు రాత్రి పన్నెండు గంటలదాకా ఆఫీసు కాగితాలు చూసుకొని, లైటు ఆర్పి కిటికీ రెక్క ఒక్కటి తెరిచి పడు కుందాం అనుకుంటూ కిటికీ దగ్గరికి వెళ్ళేటప్పటికి ఎదురుగా ఆ ఇంటి అరుగు చివరని కూచుని ఆ అమ్మాయి కనిపించింది. జరీ అంచు పట్టు పరికిణీ, తెల్లని సిల్కు పైట వేసుకుని ఏకాంతంగా కూర్చున్న ఆ అమ్మాయి మీద పల్చని వెన్నెల పడీ పడనట్లు పడుతోంది. పచ్చని అంద మైన చేతి మీద ఎర్రని గాజులు మిల మిలా మెరుస్తున్నాయి. తల ఒంచుకుని కూర్చోవడం వల్ల ముఖం కనిపించడం లేదు కాని, తీర్చిదిద్దినట్లున్న ఆ అవయ వాల్నీ, శరీరంలో తొణికిసలాడుతూన్న ఆ సౌందర్య లావణ్యాల్నీ చూసే ఆ అమ్మాయి చాలా అందమైన వ్యక్తిలాగే నాకు అనిపించింది.

కదలకుండా నిశ్చలంగా కూర్చున్న ఆ అమ్మాయిలో ఏదో దిగులూ మరేదో వేదనా గోచరించాయి. ఏ బాధా లేక పోతే అందరూ హాయిగా నిద్దర్లు పోతున్న ఈ సమయంలో ఒక్కతే వచ్చి అక్కడ ఎందుకు కూచుంటుంది? పాపం ఆ అమ్మాయి బాధ ఏమిటో! ఉన్నట్టుండి నాకు ఆ అమ్మాయి మీద ఎంతో జాలి జనించింది, "పాపం!" అని నా మనస్సులో ఇలా అనుకున్నానో లేదో, నా మనసులో భావాన్ని కనిపెట్టి ఉలిక్కి పడినట్లు అలా కళ్ళెత్తి నా కిటికీ వైపు చూసింది. వెన్నెట్లో ఆమె కళ్ళూ, కళ్ళల్లోంచి బుగ్గల మీంచి కారుతూన్న కన్నీళ్ళు మెరిశాయి. ఆ స్థితిలో తానుండగా, రహస్యంగా ఇక్కడ కిటికీలోంచి నేను తనని చూస్తున్నానని గమనిస్తే ఎంత బాధపడుతుందో! ఆఁ! ఆ భయం ఏం లేదు. నేను చీకట్లో ఉన్నానుగా? ఆమె కెలా కనిపిస్తాను? అనుకున్నా—

కాని కనిపించే ఉంటాను. లేక పోతే తడబడే అడుగులతో అలా, గోడ నీడలోకి తప్పుకోదు. మళ్ళీ కనిపిస్తుందేమోనని చాలా సేపటి వరకు చూశాను—ఉహూఁ!

మర్నాడు ఆదివారం.

అయితే ఆఫీసు— తప్పితే రూమ్‌లో కూచుని ఏ పుస్తకమో చదువుకోవడం. ఇది తప్ప ఇంకోరకంగా కాలక్షేపం చేసు కోవడం అలవాటు లేని నాకు, ఆ రోజున ఎందుకో పుస్తకం మీదకి దృష్టిపోలేదు. ఇంటివారైన ఆ పిన్నిగారితో కాస్సేపు పిచ్చాపాటి మాట్లాడదాం అంటే, వాళ్ళ ఆయన ఇంట్లో ఉండిపోయారు. ఆవిణ్ణి పిలిస్తే బాగుండదు. పోనీ ఆ అమ్మాయి కనిపిస్తుందేమో, పిలిచి కాస్సేపు కబుర్లు చెబుదాం అని కిటికీ తలుపు తెరిచిచూశాను. ఎంతసేపు చూసినా ఆ అమ్మాయి బైటికి వచ్చేజాడే కనిపించలేదు. ఏంతోచక అచ్చా డుతూ సాయంత్రందాకా ఆకిటికీదగ్గరే కాలక్షేపం చేశాను. ఆ అమ్మాయి తప్ప అంతా కనిపించారు. లోకంలోవున్న బాధ లన్నీ తానే అనుభవిస్తున్నట్లు సన్నగా వయస్సుని మించిన వృద్ధాప్యంతో పీక్కుపోయి ముడతలు పడిన ముఖంతో ఏభైఏళ్ళయినా నిండని ఓ ముసలాయన— పుష్టిగా, లావుగా ఉండి, చూపులోనూ నడకలోనూ కూడా ఓ రకమైన ఠీవి కనపరుస్తూ, కట్టుకున్న పల్చని గ్లాస్కో చీరతో పోటీ పడుతున్న బర్మాసిగలోని తెల్ల గులాబీ పువ్వు, మళ్ళిన వయస్సుతో మళ్ళ లేక మధన పడుతూన్న మనస్సుని చెబుతూంటే ఇటూ అటూ తృప్తిగా మసులుతూన్న ఓ ముప్ఫై ఏళ్ళస్త్రీ, అలంకరణతో సహా అన్నివిధాలా అమ్మ గారిని అనుకరిస్తూ ఆ ఇల్లంతా తనదే అన్నట్లు వీర విహారం చేస్తూన్న ఓ పాతి కేళ్ళ పనిమనిషి.

ఆ పనిమనిషిని కేకేసి "ఆ అమ్మాయి ఇంట్లో లేదా" అని అడుగుదాం అనిపించి కూడా మళ్ళీ ఎందుకో వూరుకున్నాను.

ఆ రోజు పౌర్ణమి! తెల్లగా పిండి ఆరబోసినట్లున్న వెన్నెలని చూసేసరికి వెన్నెట్లో అలా వెళ్ళి వద్దాం అనిపించింది. కాని భోజనం చేసి చీరా స్వెట్టర్ వేసు కొని మఫ్లర్ మెడకి చుట్టుకుంటుంటే

ఆ చుట్టూ ఉన్న రెక్కైన పొదలూ, తుమ్మ చెట్లూ, ఆ పెద్ద మైదానం జ్ఞాపకం వచ్చి భయంతో గదిలోనే ఉండిపోయా. కాని ఆ వెన్నెలని చూడాలనే కోరికని మాత్రం చంపుకోలేక కన్పానినంత మేర ఖాళీగా ఉన్న ఆ విశాలమైన మైదానాన్నీ, ఆ మైదానానికి కాపలా కాస్తున్న ఆ పెద్ద జువ్వి చెట్లనీ, బావి చుట్టూ వెన్నెట్లో మెరుస్తూన్న గచ్చు చప్టానీ చూస్తూ, భయాన్ని కల్గించే దృశ్యాలు కూడా ప్రకృతిలోని వెన్నెట్లో ఎంత అందంగా కనిపిస్తాయో అని ఆలోచిస్తూ కూర్చున్నా—

ఇంతలో ఉన్నట్టుండి ఆ దిగుడు బావి లోంచి ఏదో ఆకారం పైకి లేస్తున్నట్లు కనిపించింది. ఒక్క మారు ఒళ్లంతా జల్లు మని గుండె ఆగినట్లయింది. భయంతో బిగిసి పోయాను, నోరు తడి ఆరిపోయింది. వెంటనే రెండు చేతులతోటీ కళ్లు మూసేసుకున్నాను.

కాస్సేపటికి కాలిస్థలం అవతల వారి ఇంటి దగ్గర ఏదో అలికిడి అయితే, కళ్ల మీంచి బెదురు బెదురుగా వేళ్లు తీసి అటు చూశాను.

ఆ అమ్మాయి!

తుమ్మచెట్టు నీడలో నిలబడి నాకేసే చూస్తోంది. అమ్మయ్యా! నాకు ప్రాణం లేచివచ్చినట్లయింది. ఆ నిశిధి సమయంలో ఇంకో మనిషి తోడుగా ఉంది అనే ఆలోచనే నాకు బలాన్నిచ్చింది. ధైర్యంగా ఈ మాటు ఆ దిగుడు బావికేసి చూశాను. ఇందాకా అనవసరంగా పిరికి భయానికి నాలో నేనే నవ్వుకున్నాను. నా అనవసరపు భయం అర్థం అయి హాస్యంగా నవ్విన నా నవ్వు కూడా వినిపించినట్టుంది, ఆ అమ్మాయి కూడా నా నవ్వుతో శ్రుతి కలిపింది. ఆ నవ్వు నాకు ఎంత వింతగానో వినిపించింది. ఆ అమ్మాయితో మాట్లాడాలనే కోరిక నాలో బలీయం అయింది. కిటికీ లోంచి చెయ్యి వూపి పిలిచాను. ఎంత సేపు పిలిచినా నవ్వుతూ నిలబడిందే కాని రాలేదు. గదిలో లైటు వేద్దామని ఇటు తిరిగాను. అంతే— ఆ అమ్మాయి వెళ్లి పోయింది— మరి కన్పించ లేదు ఎంత సేపు చూసినా..

రోజు రోజుకీ మా స్నేహం బలీయం కాసాగింది. తెల్లవారితే సల్లపూస అయి పోయే ఆ అమ్మాయి, ఏ రాత్రి పూటో వాళ్ల వాకిట్లో కనిపించడం— నేను ఇంత దూరంలో నా గదిలో కిటికీ దగ్గర నిల బడి చెయ్యి వూపడం, ఆ అమ్మాయి నవ్వడం— ఆ అమ్మాయి తోటి మాట్లాడ డానికి అవకాశం ఎప్పుడు దొరుకుతుందా అని ఎదురు చూడసాగాను.

సూర్యాస్తమయం అయింది. ఇంకా వెలుగు పూర్తిగా పోలేదు. చీకటి కొంచెం కొంచెం అలుముకుంటోంది. అలా కాళీ స్థలం వేపు వెళ్లాను. ఆ అమ్మాయి దిగా లుగా తాళం వేసి ఉన్న వాళ్ల గుమ్మం దగ్గర నిలబడి ఉంది. పచ్చని బట్టలు, కాళ్లకి పసుపూపారానీ, ముఖాన్ని కళ్యాణం బొట్టూను. నేను నాలుగడుగులు అటు వేసి "భోగి వళ్ల పేరంటానికి నువు వెళ్ల లేదా?" అని పలకరించాను. ఆ అమ్మాయి తల ఎత్తి నాకేసి చూసింది. దిగులుగా ఉన్న ముఖంలోకి బలవంతంగా నవ్వు తెచ్చుకుంది.

"నేనూ వెళ్లలేదూ.... ఏం తోచక ఇలా బయలు దేరాను" అన్నాను, "అహ!" అన్నట్లు నవ్వింది.

"అలా ఎక్కడికేనా వెళదాం వస్తా వేమిటీ?" అన్నా— ఆశ్చర్యంగా నాకేసి చూసింది.

నేను ఆమె కేసి చూశాను. తన అంద మైన కళ్లని అటూ ఇటూ తిప్పుతూ సరే అన్నట్లుగా తల వూపింది.

"ఎక్కడికి వెళదాం?... నాకీ వూరు కొత్త— నువ్వే చెప్పు"— అన్నా.

కొంచెం సేపు ఆలోచించి, ఆ జువ్వి చెట్టు వేపు చూపించింది చేత్తో—

"అమ్మో, ఈ మసక చీకట్లో అక్క డికా?"

ఆ అమ్మాయి నవ్వింది. నా కది హేళనగా వినిపించింది. "సరే నడు" అన్నా మొండిగా ధైర్యం తెచ్చుకొని.

ముందు ఆ అమ్మాయి నడుస్తోంది. వెనకాల నేను. దారిలో ఎవ్వరం మాట్లాడ లేదు. నేల అంటకుండా గెంతు తూన్నట్లు నడుస్తూన్న ఆ అమ్మాయి— ఆ అమ్మాయి నడకని ఆశ్చర్యంగా చూస్తూ నేను, జువ్వి చెట్టు దగ్గర ఉన్న బావి దగ్గరకు వచ్చి ఆగింది. నేను చప్టా దగ్గిరే ఉన్న వో బండ రాయి మీద కూచున్నా. ఆ అమ్మాయి నూతి అంచు మీద అనీ అననట్లు కూచుంది. కాస్సేపు ఎవళ్ళం మాట్లాడ లేదు.

కొంతసేపయ్యాక నేను అన్నాను "నాకో విందుకో నీతోటి మాట్లాడాలని చాలా రోజుల నుంచి ఉంది."

బరువైన తన కనురెప్పల్ని ఎత్తి నాకేసి వో మారు చూసి గట్టిగా శ్వాస వదులుతూ నిర్లిప్తంగా నవ్వింది.

"నిన్ను చూస్తే ఏదో దిగులుగా ఉన్నట్లు కనిపిస్తావు — ఎందుకలా ఉంటావు? ఏమి లోటని? మీ అమ్మకీ నాన్నకీ నువ్వు ఒక్కత్తేవే కూతురు కాబోలు. అవునా?" అన్నా— ఆ అమ్మాయి సమాధానం చెప్పలేదు.

"వో రోజున మీ నాన్నని అమ్మనీ చూశాను— నీలాగే మీ అమ్మగారు కూడా బాగుంటారు."

ఆ అమ్మాయి ఉలిక్కిపడి "అమ్మా?" అంది. నూతిలోంచి వచ్చినట్లుంది ఆ ప్రశ్న.

"ఆవిడ మీ అమ్మగారు కాదూ?... మరెవరు?... నేను మీ అమ్మగారు అను కున్నాను" అన్నా—

"అందరూ అలాగే అనుకుంటారు. ఇంకో విధంగా అనుకునేలాగ ఆమె ఎప్పుడూ ప్రవర్తించదుగా?... ఆవిడ నా సవితి తల్లి. మా అమ్మ నా పదో ఏట పోయింది."

"అలాగా పాపం. అయితే ఈవిడ నిన్ను అసలు తల్లిలాగే చూస్తుందన్న మాట!"

"అంతకంటే ఎక్కువగానే చూసేది..."

"చూసేది అంటున్నావు. ఇప్పుడలా చూడడం లేదూ?"

"ఇప్పుడా?... ఇప్పు డావిడ చూడడం ఎవరికి కావాలి?" అని పకపకా నవ్వింది ఆ అమ్మాయి.

"బాగా చూసేది అని వో పక్క నుంచి అంటూనే ఇంకో పక్క నుంచి హేళనగా మాట్లాడుతున్నావు. నాకేం అర్థం కావడం లేదు" అన్నా—

"అవును— మీరు కొత్తగా వచ్చారు కదూ? ఈ సంగతులేం మీకు తెలియవు. చెప్తా వినండి" అంటూ నెమ్మదిగా ఏ లోకంలోంచో చెబుతున్నట్లు చెప్పడం ప్రారంభించింది గాంభీర్యంతో కూడిన సౌమ్యమైన కంఠంతో.

"మా అమ్మ పోయేటప్పటికి పదేళ్ల దాన్ని. అమ్మ లేని లోకం నాకు చీకటిగా మారిపోయింది. అమ్మ పడుకునే మంచం, వాడుకొనే సామానులూ, పెంచుకొనే

పొక్కిలూ ఏం చూసినా నాకు బెంగతో ఏడుపు వచ్చేది. బావురు మని ఏడుద్దాం అంటే ఎవరో ఒకరు వచ్చి "ఏడవకూడదు అమ్మా" అని కేక వేసేవారు. మూల గది లోకి పోయి ఒక్కత్తెనీ మూగగా ఎక్కెక్కి తలగడా తడిసి పోయేలాగ ఏడుస్తూ, "అమ్మా రావూ— నాకు కనిపించవూ— ఒక్క సారి రా అమ్మా" అంటూ గంటల కొలదీ తల బాదుకున్నా అమ్మ కనిపించేది కాదు. 'ఇంక అస్సలు అమ్మ కనిపించదు' అనే ఆలోచన వచ్చేసరికి కడుపులో పెద్ద బెంగ— ఇలా ఏ గదిలోనో ఒక్కత్తెనీ కూచుని ఏడ్చి ఏడ్చి నిద్రపోతే, నాన్నగారు నన్ను వెతుక్కుంటూ వచ్చి నన్ను చూసి "నా తల్లి ఇక్కడ పడుకున్నావా?" అంటూ బావురు మనేవారు. ఆయన బాధ చూడ లేక నేనూ, నా ఆవేదన చూడలేక ఆయనా ఇద్దరం ఒకళ్ళ నొకళ్ళం కౌగలించుకొని ఏడుస్తూంటే ఇది పనికాదని అత్తయ్య నన్ను వాళ్ళ వూరు తీసుకు పోయింది. అక్కడ మావయ్య కబుర్లతోనూ అత్తయ్య ఆదరణతోనూ నాలుగైదు నెలలు గడిచే సరికి కొంచెం కోలుకొన్నాను. నాన్న అప్పుడప్పుడు వచ్చి చూసేవారు". నేను ఆసక్తితో వింటూండడం చూసి కాస్సేపు ఆగి మళ్ళీ మొదలెట్టింది. "కొన్నాళ్ళ అయ్యాక నాన్న నన్ను ఇక్కడికి తీసుకు వచ్చారు. అప్పటికే మా సవితి తల్లి ఇంట్లో ఉంది. ఆవిణ్ణి 'అమ్మ' అని పిలవమన్నారు మా నాన్న. ఏమైనా సరే నేను అలా పిలవ దలుచుకోలేదు. పైగా నాకు ఆవిణ్ణి చూస్తూంటే ఎందుకో చెప్పలేనంత కోపంగా ఉండేది. ఆవిడ ఏం చెప్పినా చేసే దానిని కాదు. అసలు ఆవిడ పొడే కిట్టేదికాదు నాకు."


"నా ప్రవర్తన చూసి ఆవిడ కూడా అలాగే ఉండేది. అకారణంగా నన్ను సాధిస్తూ ఉండేది. ఎప్పుడూ ఏదో ఒకటి తిడుతూ ఉండేది. ఏ కాస్త తేడా వచ్చినా మొట్టి కాయలు మొట్టేది. నేనిబాధ పడలేక నాన్నతో చెప్పేదాన్ని— దాంతో నాన్నకీ ఆవిడకీ పెద్ద జగడం అయేది. "దాన్ని ఏమేనా చేస్తే మర్యాద దక్కదని" ఆవిడని కేక లేసేవారు— నన్ను దగ్గరగా తీసుకొని ఎంతో ప్రేమగా లాలించేవారు. మా నాన్న గారి కౌగిలితో మా అమ్మ పోయిన బాధని కూడా మరిచిపోయేదాన్ని. మా నాన్న ఎంత మంచివారు! అని ఆనందంతో కన్నీళ్ళ నింపుకునేదాన్ని. ఓ రోజున మామూలుగా మా నాన్నకీ ఆవిడకీ పెద్ద తగాదా అయింది— చివరికి "అది ముఖ్యమా నేను ముఖ్యమా?" అంది ఆవిడ. "అదే ముఖ్యం" అని నిస్సంకోచంగా చెప్పారు నాన్న. "అయితే నేను పోతున్నా" నంది ఆవిడ. "పో" అన్నారు."

"ఆవిడ పోలేదు, కాని మర్నాటి నుంచీ నన్ను హింసించే పద్ధతి మాత్రం ఆవిడ లోంచి పోయింది. నన్ను లాలనగా ప్రేమగా చూడడం మొదలు పెట్టింది. నేను అడిగి నవీ అడగనవీ అన్నీ కొనిపెట్టేది. స్వంత కూతురుకంటే ఎక్కువగా చూసుకోవడం మొదలు పెట్టేసరికి, మా అమ్మ కూడా నన్నెప్పుడూ ఇలా చూడలేదే అనిపించేది. "మన అమ్మాయికి ఇది కావాలి అది కావాలి— ఇలా చెయ్యాలి అలా చెయ్యాలి" అంటూంటే మా నాన్నగారు మొదట్లో ఆశ్చర్యపోయారు. తరువాత చాలా సంతో షించారు. ఆవిణ్ణి కూడా ఎప్పుడూ లేనంత బాగా చూడ్డం మొదలుపెట్టారు".

"బాగుంది" అన్నా—ఆ అమ్మాయి అదోలా నాకేసి చూసి మళ్ళీ ప్రారంభించింది.


"ఆవిడ నన్ను ప్రేమగా చూడ్డం ప్రారంభించాక మా నాన్నగారు నా సంగతి అంత పట్టించుకోవడం మానేశారు. కొన్నాళ్ళకి నేనంటే ఆయన బాగా నిర్లిప్తంగా ఉంటూ వచ్చారు. మా అమ్మకంటే కూడా ఈవిడ నన్ను బాగా చూస్తోందనే నమ్మ కానికి వచ్చేశాక ఇంక నాగోడవ ఆయన పట్టించుకోవడం మానేశారు.

నా మీద రాను రాను ఆవిడకి ప్రేమ ఎక్కువై పోవడంతో నాకు ఇబ్బందులూ కష్టాలూ ఎక్కువ కాజొచ్చాయి. మా నాన్నగారి తాహతుకి మించి నాకు వస్తు వుల్నీ బట్టలనీ కొనిపించేది. నా దగ్గర డబ్బు లేదని ఆయన అన్నా, నాకవ్వేమీ వద్దని నేను అన్నా, వినిపించుకునేది కాదు. పంతంబట్టి కొనిపించేది. మా నాన్నగారికి విపరీతమైన కోపం వచ్చేది. కాని అది ఎవరిమీదో మొదట్లో అర్థం ఆయేది కాదు. తర్వాత తర్వాత తెలిసింది నామీదే అని. నేను ఎంత నచ్చ చెప్పినా ఆయన నమ్మేవారు కాదు. నేనే పేచీ పెట్టి ఇవన్నీ కొనిపించుకుంటున్నానని ఆయన నమ్మకం. పరిమితమైన ఆయన ఆదాయం ఇలా అనవసరంగా ఖర్చు కావడంతో మా నిత్య జీవితం రాను రాను దుర్భరం కాసాగింది. ఫలితంగా ఎప్పుడూ తిట్టని తిట్లు నన్ను మా నాన్నగారు తిడుతూండేవారు. "శని గ్రహం" అనీ, "నన్ను కొరుక్కు తిన డానికే దాపురించిందనీ" "నా నెత్తికి గుదిబండ" అనీను. నేను మౌనంగా ఏడిచే దాన్ని. నాకివన్నీ వద్దంటే వినేవారూ కాదు నమ్మేవారూ కాదు. "నామీద నీ భయం కరమైన ఈ ప్రేమ ఆపు చెయ్యి" అని మా సవితి తల్లి కాళ్ళు పట్టుకొని ఎన్ని సార్లో బతిమాలాను. ఊహూ!... పగ పట్టిన తాచులాగ ఆవిడ తన పద్ధతి అలా కొనసాగిస్తూనే ఉంది". కొంచెం సేపు మౌనంగా ఉండిపోయింది. తర్వాత మళ్ళీ మొదలెట్టింది: "ఇలా ఉండగా నాకు పదహారేళ్ళు వచ్చాయి. ఏదో మామూలు సంబంధం చూడడానికి వీలులేదు అంది. మంచి సంబంధం చెయ్యకపోతే అనక సవితి



# నిజానిజాలు

తల్లి నీ మొన్న అరటూరు అంది. పోదిరంపింది; అల్లరి చేసింది, ఏడిపించింది, మొత్తుకుంది. మొత్తానికి వెల పట్టిన రోజున ఎంతో అయిష్టంతో మా నాన్న వో డాక్టర్ చదువుతున్న కుర్రాడికి నన్ను చూపించి పదివేలు కట్నానికి ఒప్పించారు. అంత పెద్ద సంబంధం వద్దన్నాను. నేను చేసు కోను అన్నాను. కాని మా నాన్న నన్ను అర్థం చేసుకోకుండా ''ఇవాళ ఇలాగే అంటావు. రేపొద్దున్న మా సవితి తల్లి, మా నా వ్వా ఈ దిక్కు లే చేశారని పూరూ వాడా చాటుతావు— ఎందుకులే తల్లీ, అనక నేం ముష్టి ఎత్తుకుంటే ఎత్తుకున్నాం ప్రస్తుతానికి ఈ ఇల్లు అమ్మేసి పదివేలూ కట్నం ఇచ్చి ఈ సంబంధం చేసెయ్యనీ'' అన్నారు.

"ఇల్లు అమ్మేస్తారా? నాకోసం?" మా నాన్న అన్న మాటలకి నేను వెక్కి వెక్కి ఏడ్చాను. కాళ్లు పట్టుకున్నాను, బతిమాలాను, ఉపవాసాలున్నాను, నేనీ సంబంధం చేసుకోనని బెదిరించాను. మిమ్మల్ని బాధించి పెద్ద సంబంధం చేయమనేటంత స్వార్థపరురాలిని కాదు అన్నాను. నాకు అంత మహార్క్యం లేదన్నాను. నామాట నమ్మండి అన్నాను, మీరు నాకోసం సర్వనాశనం కావద్దు అన్నాను.

మా సవితి తల్లి కాని, నాన్న కాని నా మాట వినలేదు. పెళ్లి పనులు జోరుగా సాగించేస్తున్నారు. ఇల్లు కూడా బేరం పెట్టేసి బజానా తీసుకున్నారు. ఏడుస్తున్న నన్ను బలవంతంగా పెళ్లికూతుర్ని చేశారు. భోగీనాడు రాత్రి ముహూర్తం కూడా నిర్ణయించారు. ఇంక పెళ్లి తప్పదు. ఈ పెళ్లి నేను చేసుకుంటే మా నాన్నకి జీవించడానికి ఇంకేం మిగలదు. నాధర్మమా అని ముష్టి ఎత్తుకోవాలి. భోగీనాడు రాత్రే నాపెళ్లి" అంటూ వెక్కి వెక్కి ఏడుసాగింది బావిగట్టుమీద కూర్చుని ఆ అమ్మాయి.

నేను ఆశ్చర్యపోతూ "ఈ రాత్రి నీ పెళ్ళా? అందుకేనా ఈ కళ్యాణం బొట్టూ అవీను? పెళ్లి హడావిడే లేదే, మీ ఇంటి దగ్గర? నిజంగానే! ఇవాళే నీపెళ్లి? నీ పెళ్లి ఇవాళే!" అని నేనోమూల అంటూం ఉంటే, ఉరుము ఉరిమినట్లు ఒక్క పెద్ద నవ్వు నవ్వి "నా పెళ్లి— అహ్హా హ్హా— నా పెళ్లి" అంటూ ఆ అమ్మాయి బావిలో ఉరికేసింది దభీమని. నిశ్చేష్టురాలనయిపోయి భయంతో నేను కెవ్వుమని ఒక్క కేకవేశాను. "అయ్యో అమ్మాయి పడి పోయింది, అమ్మాయి పడి పోయింది" అని అరిచాను గట్టిగా. నా అరుపులు విని దూరం నుంచి ఆ మసక చీకట్లో అయిదారుగురు పరిగెత్తుకొని వచ్చారు. నేను వాళ్లతో కంగారుగా "ఇప్పుడే పడిపోయింది అదే ఆ పెళ్లికూతురు. ఆ తుమ్మ చెట్టు దగ్గర ఇంటివారి అమ్మాయి" అంటూ బావి చుట్టూ అలంగం తిరుగుతూంటే, వచ్చిన వాళ్లంతా నిర్లిప్తంగా "సరి— ఏదా? అది ఇప్పుడు పడి పోవడమే! నిరుడు భోగీనాడే ఈ బావిలో పడి చచ్చింది. ముదనష్టపు పిల్ల— నిక్షేపం లాంటి పెళ్లి చేసుకోలేక తెగులు" అన్నారు.

నేను తెల్లబోయి "కాదు ఇప్పుడు నా ఎదురు గుండా..." అనబోతే "చాల్లేండి అది చచ్చి ఇవాళ్టికి ఏడాదయింది. మీరు ఎవర్ని చూశారో" అన్నారు. "అయితే ఇప్పటిదాకా నేను మాట్లాడిన అమ్మాయి!.. అమ్మ బాబోయ్!"—అంటూ వెనక్కి విరుచుకు పడిపోయాను.

నాకు స్పృహ వచ్చి కళ్లు తెరిచేటప్పటికి నా చుట్టూ ఉన్న వాళ్లు తలకొక విధంగానూ అంటున్నారు.

"తను చచ్చింది చాలక తక్కిన వాళ్లందరికీ కనిపించి వాళ్లని కూడా చంపుకు తినడం ఎందుకు?"

"ఎందుకేమిటి ? బ్రతికున్నప్పుడు ఆ సవితి తల్లినీ తండ్రినీ కాల్చుకు తినలేదూ?"

"బాగా చెప్పావు, బతికీ సాధించింది, చచ్చీ సాధించింది, దేవుడు లాంటి ఆ తండ్రినీ, తల్లికంటే శతవిధాల ప్రేమగా చూసుకునే ఆ ఇల్లాలినీను."

"పాపం — లోపల్లోపల ఎంత కుమిలి కుమిలి ఏడుస్తున్నారో వాళ్లిద్దరూ."

"కడుపు తీపివల్ల అలా ఇదవుతున్నారు కాని, ఇలాంటి పాడు బుద్ధులతో ప్రాణాలు బలవంతంగా తీసుకునే అర్ధాయుష్షు మూర్ఖుల కోసం ఏడవక్కర్లేదు"

"బాగా చెప్పావు— ఏం తెగులా? నిక్షేపం లాంటి సంబంధం చూశాడే తండ్రి? తనకేం లోటని చావడం? వెధవ బతుకు వెధవ బతుకా అని—"

ఇలా నలుగురూ నాలుగు రకాలుగానూ అనుకుంటుంటే, నేను చేసేదేంలేక, చెప్పగలిగింది అంతకంటే లేక, జరిగిందంతా జ్ఞాపకం వస్తూంటే భయంతో కళ్లు మూసుకున్నాను.

వెంటనే దీనంగా ఆ అమ్మాయి ముఖం కనిపించింది. జాలిగా నాకేసి చూస్తోంది. "మీరూ నన్ను అర్థం చేసుకోలేదూ?" అన్నట్లున్నాయి ఆ చూపులు. నా మనసు కరిగి పోయింది. దుఃఖం పెల్లుబికి వచ్చింది. "నీ జీవితంలోని నిజానిజాలు వీళ్ళకి తెలియవు. నీ రూపాన్నే చూశారు కాని నీ బాధనేం చూశారు? నీ హృదయాన్నేం ఎరుగుదురు? నాకు తెలుసు తల్లీ. వెన్న లాంటి నీ హృదయం నాకు తెలుసు. నువ్వెందుకీ అకృత్యానికి పూనుకున్నావో, నీ హృదయం ఎంత కలగిపోతే నువ్వీపని చేశావో నాకు తెలుసు. కళ్లు తుడుచుకో తల్లీ!" అంటూంటే రెండు కన్నీటి బొట్లు నా కళ్ల లోంచి జారి, నా గుండె లోని మంటకి ఆవిరి అయి గాలిలో కలిసి పోయాయి, ఆ అమ్మాయి జీవితంలాగా, ఆచరణలో పెట్టలేని నా స్త్రీ సంక్షేమ ఆలోచనల్లాగాను. ●

